# ఈ ఇల్లు నాది

మధ్యాహ్నం పన్నెండున్నరకు చేరవలసిన బండి రెండు గంటలు ఆలస్యంగా చేరింది. గుంటూరు వచ్చి చాలా రోజులవుతోంది. ఈ ప్రయాణం విసుగెత్తింది. నా కోసం అన్నయ్య కాని తమ్ముడు కాని రైల్వేస్టేషన్‌కు వస్తారేమోనని అనుకున్నాను. వాళ్ళను చూసి రెండు సంవత్సరాలవుతోంది. మునుపు మా ఊరు వెళ్ళాలనే ఊహకే ఎంతో సంతోషపడిపోయే దాన్ని. అప్పటి ఆనందం, ఉత్సాహం ఇప్పుడు లేవు. నాతో చదువుకున్న వాళ్ళు, తెలిసినవాళ్ళు, బంధువులు ఇప్పుడక్కడ ఎవరూ లేరు. విసిరి వేయబడ్డట్టు అటూ, ఇటూ, ఎటో వెళ్ళిపోయారు. అమ్మ చనిపోయాక ఇల్లు బోసిపోయింది. నాకు నేను మా ఇంట్లో కొత్తగా అనిపిస్తుంటాను. రెండురోజుల కన్నా ఎక్కువ ఉండాలనిపించదు. హైదరాబాద్ తిరిగి ఎప్పుడు వెళ్ళిపోదామా అనిపిస్తుంటుంది. రిజిస్ట్రేషన్‌కయి గుంటూరు వచ్చాను. రేపటితో పనయిపోతుంది. ఈ సరికి తిరుగు ప్రయాణంలో ఉంటాను.

రిక్షా మాట్లాడుకుని ఇంటికి చేరుకునేసరికి మూడు దాటింది. తమ్ముడు ఇంట్లోనే ఉన్నాడు. "ఏరా, స్టేషనుకు రాలేదేం?" అడిగాను. నవ్వి ఊరుకున్నాడు. లోగడ ప్రతిసారీ స్టేషనుకు వచ్చేవాడు. చిన్నప్పటి ఆత్మీయతలు వయసువచ్చే కొద్దీ తగ్గిపోతుంటాయేమో. మాటలు కూడా పొడిగా ఉన్నాయి. చిన్నప్పుడు నేనూ, అన్నయ్యా, తమ్ముడు ఎంతో సంతోషంగా మా ఇంట్లో, మా ఇంటి చుట్టూ ఉన్న చెట్లలో ఆడుకునేవాళ్ళం. మాతోపాటు చెట్లు కూడా ఆనందించేవనిపించేది. ఆ చెట్లు ఇంకా ఎదుగుతూనే ఉన్నాయి. మా మనసులు ఎదగడం మానేశాయా? ఏమో. అప్పట్లో మాకు తోడుగా మా ఇంటి చుట్టు పక్కలున్న మా ఈడు పిల్లలు వచ్చేవాళ్ళు. సందడిగా ఉండేది. తినడానికి అమ్మ అందరికీ ఏదయినా చేసి పెడుతుండేది. ఎంతసేపు ఆడుకున్నా సమయం తెలిసేది కాదు. ఇద్దరి మగపిల్లల మధ్య నేను ఒక్కర్తినే అవటాన వాళ్ళ మీద అమ్మ నన్ను ముద్దుగా చూసుకునేది. అన్నయ్య కంటికి రెప్పలా నన్ను చూసుకునేవాడు. తమ్ముడు మరీనూ. నా మీద ఈగ వాలనిచ్చేవాడు కాదు. నా పేరుకు తగ్గట్టు రాణిలా పెరిగాను. ఇప్పుడు ఏ శోభ

లేదు. అమ్మ చనిపోయి అయిదేళ్లు కావస్తోంది. అమ్మతో పాటు ఆ ఇంటితో నాకు ఉన్న సంబంధాలు డీలా అయిపోయాయేమో అనిపిస్తూ ఉంటుంది. మా ఇల్లు చూస్తోంటే దొరకని దేనికోసమో వెదుకుతున్నట్టు అనిపించి అలిసిపోయినట్టుగా ఉంటుంది.

గుంటూరులోనే ఉంటున్నా అన్నయ్య వేరయి గుండారావు పేటలో ఉంటున్నాడు. అన్నయ్యా, వదిన కార్పొరేషన్ స్కూల్సులో టీచర్లుగా పనిచేస్తున్నారు. తమ్ముడికి పెళ్ళి అయింది. నికరంగా ఏ ఉద్యోగంలో ఉండడు. తరుచు మారిపోతుంటాడు. ఇష్టపడి తనకు నచ్చిన అమ్మాయినే చేసుకున్నాడు. ఏం జరుగుతోందో, ఏమో వాడి సాంసారిక జీవితం అటూ ఇటూ కదిపిన చదరంగం పావుల్లా అయినట్టనిపిస్తోంది. వివరాలు తెలుసుకుందామని ప్రయత్నించి విఫలమయ్యాను. నాన్నకు అరవయి ఎనిమిది సంవత్సరాలు దాటాయి. ఏ చీకూ చింతా లేని మనిషి. ఆరోగ్యంగానే ఉన్నాడు. ఒకరి మీద ఆధారపడి బతికే తత్వం కాదు. నెలకు తొమ్మిదివేల పయి చిలుకు వరకు పెన్షను వస్తుంటుంది. ఇప్పటికీ తన భోజనం తయారు చేసుకుంటాడు. ఈ వయసులో కష్టపడడం ఎందుకని వచ్చి నా దగ్గర ఉండమని చాలాసార్లు అడిగాను. వస్తానంటాడు. కాని రాడు. గుంటూరు వదిలిపెట్టడానికి ఇష్టపడడు.

నా భర్త చనిపోయి ఎనిమిది సంవత్సరాలు దాటాయి. కంపేషనేట్ గ్రౌండ్స్‌లో ఆయన పనిచేసిన ఆఫీసులోనే నాకు ఉద్యోగం ఇచ్చారు. వాళ్ళ ఆఫీసుశాఖ ఏదీ గుంటూరులో కాని దరిదాపుల్లో కాని లేకపోవటం వలన నా పిల్లలతో హైదరాబాద్‌లోనే ఉండిపోవలసి వచ్చింది. నా పిల్లలిద్దరు ఇంటరులో ఉన్నారు. కంపెనీ క్వార్టర్స్‌లో ఉంటున్నాం. సొంత ఇల్లు కట్టుకుందామని ఉంది. పిల్లల్ని చదివించుకుంటూ ఇల్లు కట్టుకునేంత ఆర్థిక స్తోమత నాకు లేదు.

అన్నయ్య పరిస్థితి బాగానే ఉంది. ఎక్కడా లోను తీసుకోకుండా నాలుగు గదుల ఇల్లు కట్టుకున్నాడు. తమ్ముడు నాన్నతో ఉంటాడు. వాడి భార్య బృందావన్ గార్డెన్స్‌లో తల్లి దగ్గర ఉంటోంది. ఆమెను చూసి చాలా కాలమయింది. వాళ్ళకింత వరకు పిల్లలు కలగలేదు. వాడంటే నాన్నకు చాలా ఇష్టం.

మాది ఆరుగదుల ఇల్లు. నాన్నకూ, తమ్ముడికి ఆ ఇల్లు పెద్దదే. మూడు గదులు ఒక వాటాగా చేసి దాన్ని అద్దెకు ఇచ్చారు. అద్దెకు దిగిన వ్యక్తి ఒక సంవత్సరం పాటేమో ఇంటి అద్దె మంచిగా ఇచ్చి, ఏమనుకున్నాడో ఏమో అద్దె ఇవ్వడం మానేశాడు.

ఖాళీ చేయదు. నానాకష్టాలు పడి అతన్ని ఆ వాటా నుండి బయటకు పంపించడానికి నాన్నా వాళ్ళకు చాలా సమయం పట్టింది. మధ్యలో పోలీసులు ఎంతో కొంత తీసుకున్నారు. కాని ఏం చేయలేదు. అతన్నుంచి కూడా డబ్బులు వసూలు చేసుకుని ఉంటారు. ఆ తర్వాత ఆ వాటాను ఎవరికీ అద్దెకు ఇవ్వడానికి నాన్న సాహసం చేయలేదు. ఆ వాటా తనకు వస్తుందని తమ్ముడు ఎవరి దగ్గరో అప్పు తీసుకుని, నోటు రాసి, చాలా మొత్తమే తీసుకున్నాడని ఆ మధ్యఎప్పుడో అన్నయ్యే నాతో అన్నాడు. నిజమేనా అని నేను నాన్నను అడగలేదు. తమ్ముడిని అడిగి లాభం ఉండదు. తెలుసుకుని నేను చేసేది ఏమీ ఉండదు.

అమ్మ హైదరాబాద్‌లో తన చివరి రోజుల్లో నా దగ్గర ఉండి ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న సమయంలో అన్నయ్య భార్య, తమ్ముడి భార్య పోటీలు పడి ఏ చిన్న వస్తువూ వదలకుండా ఇంట్లోని సామాన్లు, చివరకు గరిటలు కూడా వదలకుండా పంచుకుని తీసుకువెళ్ళిపోయారు. ఈ విషయం గుర్తు వచ్చినప్పుడల్లా మనసు కలుక్కుమంటుంది.

నాన్న ఉంటున్న ఇల్లు, దానికి ఆనుకుని ఉన్న ఎనిమిది వందల యాబయి చదరపు గజాల ఖాళీస్థలం అమ్మపేరు మీద ఉంది. నాన్న పేరు మీద బదిలీ కాలేదు. బదిలీకి కాని, పంచుకోవడానికి కాని మా నలుగురి సంతకాలు కావాలి. రేపు రిజిస్ట్రేషన్ జరుగుతుంది. ఎలా చేయాలని అనుకుంటున్నారో నాకు స్పష్టంగా లేదు. అడగాలని అనుకుంటూనే డెలికసీ ఫీలవుతున్నాను.

సాయంత్రం ఆరింటికి నలుగురం మధ్య గదిలోని సోఫాల్లో కూర్చున్న సమయంలో కూడా నాన్న తన మనసులో మాట బయటపెట్టలేదు. మా మధ్య కనిపించని గోడలు ఏర్పడుతున్నట్టు ఉన్నాయి. చాలాసేపటివరకు ఏవేవో మాట్లాడుకుంటున్నాం కాని అసలు విషయాన్ని ఎవరం ముట్టుకోవడం లేదు.

అడగకూడదనుకుంటూనే అడగకుండా ఉండలేక పోయాను, "నాకేమి ఇవ్వాలనుకుంటున్నారు?"

"నీకు పెళ్ళిచేసి పంపించాం కదా, ఇంకేమివ్వాలి?" అడిగాడు అన్నయ్య. మాటలో సౌమ్యత లేదు. వాడామాట అంటాడని నేను అనుకోలేదు.

తన్నుకుంటూ వస్తూన్న దుఃఖాన్ని ఆపుకుంటూ, "ఆడపిల్లను, మీ తోబుట్టువును. భర్తలేని దాన్ని. నా పెళ్ళప్పుడు కట్నకానుకల రూపాన కూడా ఏమీ ఇవ్వలేదు" అంటోంటే నా మీద నాకే జాలి వేసింది. అనకుండా ఉండాల్సింది.

తమ్ముడు, "కట్న కానుకలు ఇస్తామంటే మీ ఆయనే కదా వద్దన్నది?" అన్నాడు. వాడి చిన్నప్పుడు గోరు ముద్దలు అమ్మకాదు, నేను తినిపించాను. ఏవయినా ఎందుకు గుర్తుంచుకోవాలి?

"లేకుంటే తప్పకుండా ఇచ్చి ఉండేవాళ్ళం కదా?" అన్నాడు అన్నయ్య.

"అన్నాడు. నేను కాదనడం లేదు. అప్పుడాయన నాన్నకు ఎటువంటి ఇబ్బంది కలిగించకూడదని అడగలేదు.. అవసరం ఉండి నేను అడుగుతున్నాను..." కొద్ది కొద్దిగా ధైర్యం వస్తోంది.

"నీకు ఇద్దరూ ఆడపిల్లలే కదా, వేరే ఎవరికో వెళ్ళిపోయే ఆస్తిని ఇచ్చి లాభం ఏమిటి?" అడిగాడు తమ్ముడు.

"నీకు ఇంతవరకు పిల్లలు కలుగలేదు. కలగాలనే కోరుకుంటాను. నీకూ నాలా ఆడపిల్లలే పుడితేనో?" ఆగాను. అంతకన్నా ఎక్కువ మాట్లాడడం బావుండదు.

తమ్ముడు కోపంతో ఏదో అనబోయాడు, అనలేదు.

ముగ్గురి ముఖాల్లోకి చూసి, "ఇంకో విషయం ఏవిటంటే ఈ ఆస్తి అంతా తాతయ్య నుండి అమ్మకు సంక్రమించిందేకదా, ఆస్తి అక్షరాలా అమ్మదే కాదా? కాకపోతే నాన్న ఇల్లు కట్టాడు. ఇల్లు కట్టుకునేందుకు కూడా నాన్నకు తాతయ్య ఆర్థికంగా సహాయం చేశాడు. కాదా నాన్నా?" అడిగాను.

నాన్న నా ముఖంలోకి చూస్తూ ఉండిపోయాడు కాని పెదవి విప్పలేదు. మగాళ్ళకు ఎదురు తిరిగి మాట్లాడకూడదని నా చిన్నతనంలో అమ్మ నాకు నూరిపోసింది. ఆ మార్పిడి లోంచి బయట పడడానికి నాకు సమయం పట్టింది. అవసరమయిన చోట గట్టిగా మాట్లాడలేక పోతోంటే ఆఫీసులో కూడా తట్టుకోవడం కష్టమయిపోతోంది. న్యాయం అనేది సహాయానుకూలపు బూటకం. అంతే.

రాత్రి ఎనిమిదన్నరకు భోజనం చేశాక ఇంటి బయట పేముకుర్చీ వేసుకుని కూర్చున్నాను. చిన్నప్పటి సంగతులు జ్ఞాపకానికి వస్తున్నాయి. చీకటి చలిగా ఉంది.

"బుజ్జీ" పిలిచాడు నాన్న.

"నాన్నా".

"బయట చల్లగా ఉందిరా. ప్రయాణం చేసి వచ్చావు. బడలికగా లేదూ? వచ్చి పడుకోమ్మా."

"తమ్ముడిని రానీ".

బి.పి.కరుణాకర్

"వాడు వచ్చేసరికి ఆలస్యం అవుతుంది."

"వస్తున్నా నాన్నా" అన్నాను కాని కుర్చీలోంచి లేవబుద్ధి కావడం లేదు.

నాన్న వరండాలోని మంచం మీద పడుకుని ఉన్నాడు. బెడ్ లయిటు వెలుగుతోంది. వర్షాకాలంలో కాని చలికాలంలో కాని నాన్న వరండాలోనే పడుకుంటాడు. ఇంట్లో పడుకుంటే ఆయనకు అస్సలు నిద్రపట్టదు.

ముప్పావుగంట తర్వాత అనుకుంటాను. నాన్న నన్ను మళ్ళా పిలిచాడు, "బుజ్జీ"

"నాన్నా".

"తమ్ముడొచ్చాడట్రా?"

"రాలేదు నాన్నా".

"కొన్నిసార్లు ఇక్కడకు రాడమ్మా. వాడి భార్య వాళ్ళింటికి వెళ్తుంటాడు. నువ్వు పడుకో."

"సరే నాన్నా".

కుర్చీలోంచి దిగి, ఇంట్లోకి వెళ్ళి పడుకుందామనిపించడం లేదు. లోపలికి వెళ్ళి పడుకున్నా వెంటనే నిద్రపట్టదు. మనసు కలతగా లేదు కాని చిక్కుపడిన దారంలా ఉంది. సాయంత్రం ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా మాటలు ముందుకు సాగలేదు. నామీద ముగ్గురికీ కోపం వచ్చిందనే అనుకుంటాను. ఎవరూ బయటపడి ఏ మాటా అనలేదు. నాకు ఎవరిమీదా కోపంలేదు. రేపు రిజిస్ట్రేషన్ అయితే మాలో, ఒకరితో ఒకరికి, సంబంధాలు ఉంటాయో, ఉండవో ఊహించలేకుండా ఉన్నాను.

మరో అరగంట కూర్చుని ఉంటాను. చలి ఎక్కువవుతోంది. తెగని సమస్య గురించి ఆలోచించదల్చుకోలేదు. లేచి, కుర్చీ తీసుకుని వరండాలోకి వచ్చి, కుర్చీగోడ పక్కగా పెట్టి గదిలోకి నడవబోతోంటే, నాన్న ఎవరో తనను మంచం మీంచి కిందికి నెట్టేసినట్టు పడిపోయి. "నీదేలేవే. ఈ ఇల్లు నీదే లేవే" నిద్రలోనే ఎవరితోనే మాట్లాడుతున్నట్టు అంటోంటే ఆగాను. నాన్న నన్ను చూసినట్టు లేదు. వెంటనే లేచి మంచం మీద పడుకుని తిరిగి నిద్రలోకి జారిపోయాడు.

* ఆదివారం వార్త 2011